క్లుప్తంగా

మేకల మంద పైనుంచి వెళ్లిన లారీ


లారీ కింద పడి మృతి చెందిన మేకలు

అద్దంకి: మేకల మందపై నుంచి లారీ వెళ్లడంతో ఐదు మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈఘటన మేదరమెట్ల–నార్కెట్‌పల్లి సంత మాగులూరు మండలం రాష్ట్రీయ రహదారిలోని ఏల్చూరు గ్రామంలో ఆదివారం జరిగింది. అందిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఎస్. వెంకటేశ్వర్లు మేకలను మేపుకునేందుకు తోలుకెళ్తున్నాడు. ఈ క్రమంలో హైద్రాబాద్ వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న లారీ మందపై నుంచి వెళ్లడంతో ఐదు మేకలు లారీ కిందపడి మృతిచెందాయి. మృతిచెందిన ఐదు మేకల విలువ రూ.60 వేల వరకు ఉంటుందని యజమాని వెంకటేశ్వర్లు వాపోయాడు.

ఫిబ్రవరి 5న పూర్వ విద్యార్థుల సమావేశం

చీరాల అర్బన్: పట్టణంలోని నూనె రంగనాయకులు, పానకాలు మున్సిపల్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఫిబ్రవరి 5న ఆదివారం సాయంత్రం 4గంటలకు పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులందరూ పాల్గొనాలని వారు కోరారు.

పొగాకు బ్యారన్ దగ్ధం


మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మేదరమెట్ల: పొగాకు బ్యారన్‌లో మంటలు అంటుకోవడంతో పొగాకు దగ్ధమైంది. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామంలో ఓగూరి సురేష్‌కు చెందిన పొగాకు బ్యారన్ ఆదివారం అగ్నికి ఆహుతి అయ్యింది. బాధితుడి సమాచారం మేరకు పొగాకు కర్రలను కాల్చే క్రమంలో బ్యారన్‌లో కర్రలు జారిపడటంతో ఆదివారం ఉదయం ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో అద్దంకి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే పొగాకు పూర్తిగా కాలిబూడిద అయ్యిందని, దీనివిలువ సుమారు రూ.4 లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

శాప్ మోడల్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

అద్దంకి రూరల్: స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ (శాప్) రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ మోడల్ టెస్ట్‌లో విద్యార్థులు ప్రతిభ చూపారు. అద్దంకి మండల యూనిట్ ఆధ్వర్యంలో అద్దంకిలోని ప్రకాశం బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. పరీక్షకు అద్దంకి మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 108 విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి స్థానంలో మండలంలోని తిమ్మాపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఏ. శ్రీరామ్‌శాయి సూర్యతేజకు, రెండో స్థానం అద్దంకి ప్రకాశం ఉన్నత బాలిక కె. షణ్ముఖప్రియ సాధించారు. పరీక్షల నిర్వహణలో బాపట్ల జిల్లా మాజీ అధ్యక్షుడు కె. మాధవరావు, అద్దంకి మండల బాధ్యుడు కె. శ్రీనివాసరావు, ఈశ్వరయ్య, బీసీహెచ్ చంద్రశేఖర్, అన్ని పాఠశాలల హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

జగనన్న చేదోడులో 149 మందికి లబ్ధి

బల్లికురవ: ప్రభుత్వం దర్జీలు, రజకులు నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి జగనన్న చేదోడు పథకంలో 149 లబ్ధిదారులు ఎంపికయ్యారని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ ఆదివారం తెలిపారు. ఈ పథకంలో 2020–21లో 20 సచివాలయాల్లో 130 మంది, 2021–22లో 150 మంది, 2022–23 లో 49 మంది అర్హులుగా ఎంపికయ్యారని తెలిపారు.

నాడు దైన్యం.. నేడు ధైర్యం

- కార్పొరేట్‌స్థాయి సౌకర్యాలతో యద్దనపూడి పీహెచ్‌సీ
- సకల హంగులతో నిర్మాణం
- రూ.1.75 కోట్లతో నిర్మాణ పనులు పూర్తి
- తీరనున్న రోగుల కష్టాలు


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న యద్దనపూడి పీహెచ్‌సీ భవనం

యద్దనపూడి: ప్రజలకు మేలు చేయాలన్న చిత్తశుద్ధి ఉంటే అడ్డున్నదే ఉండదు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు మంచి చేయటంలో వెనుకడుగు వేయడంలేదు. ఇందుకు ఉదాహరణే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం. గ్రామీణ ప్రాంతాల్లోని పేదప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించటం చరిత్రలో ఇదే తొలిసారి. ఇది గతానికి భిన్నం. గత ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీ అంటే గ్రామీణ ప్రాంతాలకు చేరువలో ఉన్నప్పటికీ సేవల్లో మాత్రం నాసిరకం. వైద్య సిబ్బంది ఎప్పుడు అందుబాటులో ఉండేవారు కాదు. అలాగే ఆసుపత్రి భవనాలు కూడా శిథిలావస్థకు చేరాయి. ఒక వేళ ఆసుపత్రికి వెళ్లినా పరిసరాల్లో కాసేపు నిలబడటానికి కూడా దుర్లభంగా ఉండే పరిస్థితి. ఇలా ఎన్నో ఏళ్లుగా పేదప్రజలకు వైద్యసేవలు అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. గత ప్రభుత్వ హయాంలో ఉన్న పరిస్థితులకు చెక్ పెడుతూ నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా నూతన పీహెచ్‌సీలను ప్రభుత్వం నిర్మిస్తోంది. ఇందులో భాగంగానే మండల కేంద్రమైన యద్దనపూడిలో రూ. 1.75 కోట్ల నిధులతో నూతన పీహెచ్‌సీ భవనాన్ని నిర్మించారు.

ఆధునిక హంగులతో నిర్మాణం..

గత పీహెచ్‌సీ భవనాన్ని 2001లో నిర్మించింది అయినా ఆ భవనం చెరువు పక్కనే ఉండటం, మెతక నేల కావడంతో దాని పునాదులు కుంగిపోయి గోడలు బీటలువారి శిథిలావస్థకు చేరుకుంది. వర్షం పడితే చాలు భవనం మొత్తం కారుతోంది. దీంతో వైద్యసేవలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఏడేళ్ల కిందట వైద్య, ఆరోగ్యశాఖ ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి ఈ భవనం మరమ్మతులకు పనికిరాదని, కొత్తభవనం నిర్మించాలని ఉన్నతాధికారులకు తెలియజేసినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు.

అన్నీ వసతుల ఏర్పాటు..

నాడు–నేడు పనుల్లో భాగంగా పీహెచ్‌సీ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.75 కోట్ల నిధులు మంజూరు చేసింది. టెండర్లు పిలవటంతో సదరు కాంట్రాక్టర్ అధికారుల పర్యవేక్షణలో భవన నిర్మాణ పనులు పూర్తి చేశారు. సుమారు ఆరువేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన భవనాన్ని నిర్మించారు. ఇందులో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా జనరల్ వార్డులు, ఆపరేషన్ థియేటర్, ప్రసూతిగది, ఇద్దరు వైద్యాధికారులతో పాటు ఆయుష్ వైద్యుడికి వేర్వేరుగా కన్సల్టేషన్ గదులు, స్టాఫ్ నర్సుల కోసం ప్రత్యేక గది, మెడిసిన్ స్టోర్, ల్యాబ్, ఆసుపత్రికి వచ్చే రోగులకు మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యంతో పాటు ఆసుపత్రి ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టారు. మరో నెలరోజుల్లో నూతన పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించనున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి..



ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరింది. తగినంత సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించలేకపోతున్నాం. నూతన భవనం ప్రారంభించగానే పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువస్తాం.

– సుభాషిణి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట


పొగాకు కూలీలతో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. ఆయన ఆదివారం మండలంలోని కలవకూరు గ్రామంలోని ఒకటో సచివాలయ పరిధిలోని కలవకూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. గ్రామంలో సమస్యలను తెలుసుకుంటూ, యువకులు, వృద్ధులను పలుకరించి వారి క్షేమ సమాచారాలు తెలుసుకుంటూ ముందుకు సాగాడు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించాడు. గ్రామంలో పొగాకు కూలీల కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నాడు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో సీసీ రహదారులు, సీసీ డ్రైనులు, అవసరమైన ఇతర పనులు చేయించడానికి నిధులు కేటాయించనున్నట్లు చెప్పారు. గడప గడప కార్యక్రమంలో పర్యటించే సమయంలో ప్రజలు ఆయా పనులను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్రామ స్వరాజ్యం కోసం, గ్రామాల్లో సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని చెప్పారు. ఈ వ్యవస్థతో ప్రజలు మండల కేంద్రాలకు పనుల కోసం పరుగెత్తకుండా సచివాలయాల్లోనే అన్ని పనులు రుగుతున్నాయని చెప్పారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో అభివృద్ధి, ఇచ్చిన హామీలను నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరలా మరలా సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్ని పార్టీలు కలసి వచ్చినా పార్టీకి జనంలో ఉన్న ఆదరణను తుడిచేయలేవన్నారు. అభిమానాన్ని రానున్న ఎన్నికల్లో చూపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అవిశన జ్యోతి, పార్టీ మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, సర్పంచ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వలంటీర్లు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

వైద్య శిబిరానికి విశేష స్పందన


శిబిరంలో మాట్లాడుతున్న గరటయ్య


వైద్య పరీక్షలు నిమిత్తం వచ్చిన రోగులు

జే.పంగులూరు: వైద్యుడిని దేవుడితో సమానంగా చూస్తారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బాచిన చెంచు గరటయ్య అన్నారు. మండలంలోని పంగులూరు సచివాలయ ప్రాంగణంలోని కళాక్షేత్రం నందు ఆదివారం గుంటూరు శ్రావణి హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రసుత కాలంలో 30 ఏళ్లు దాటిన ప్రతి వ్యక్తి వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. అనంతరం వైద్యులను గరటయ్య సన్మానించారు. 304 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. వారిలో 40 మందికి మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహించేందుకు హాస్పిటల్‌కు సిఫారసు చేశారు. శిబిరంలో ఈసీజీ, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు పోసాని శ్రీనివాసరావు, డాక్టర్ ఈ అనీల్‌కుమార్, సీహెచ్ విజయకృష్ణారెడ్డి, జూనియర్ డాక్టర్లు నాగేశ్వరావు, వినయ్, హాస్పిటల్ జీఎం మగ్బుల్, జెడ్పీటీసీ సభ్యురాలు రాయిణి ప్రమీళ, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంకట సుబ్బారావు, సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం రామారావు, ఆర్ఎంపీలు వెంకట్రావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన


విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

యద్దనపూడి: మండలంలోని అనంతవరం గ్రామం ఎస్సీ కాలనీలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సమతా సైనికదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల చిట్టిబాబు, యద్దనపూడి మండలం పోలీస్ స్టేషన్ ఎస్సై రత్నకుమారి, జైభీమ్ పార్టీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ జెట్టి శివ, మాల మహానాడు బాపట్ల జిల్లా నాయకులు శీలం రోషన్, సాతులూరి రవి పాల్గొన్నారు. ముందుగా ఎస్సై రత్నకుమారి, కంచర్ల చిట్టిబాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ చరణ్ శంకర్, సమతా సైనిక్ దళ్ జిల్లా కన్వీనర్ బొల్లాపల్లి బెన్నిబాబు, యద్దనపూడి మండల కన్వీనర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

విచారణ ఎంతకాలం చేస్తారు..?


నిరసన తెలుపుతున్న బాధితులు

వేటపాలెం: వేటపాలెం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నిధుల గోల్ కేసు కేసులో పోలీసులు విచారణ ఎంతకాం చేస్తారని బాధితులు ప్రశ్నించారు. స్థానిక చెన్నకేశవస్వామి దేవస్థానంలో బాధితుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ సొసైటీ నిధుల గోల్‌మాల్ ఘటన జరిగి ఒకటిన్నర సంవత్సరం అయినప్పటికీ ఇంత వరకు పోలీసులు నిందితులపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయలేదన్నారు. నిధులు గోల్‌మాల్ చేసిన వారిని ఎంత కాలం విచారిస్తారన్నారు. 600 మంది డిపాజిట్ల రూపంలో దాచుకున్న రూ. 25 కోట్లు నగదును సొసైటీ కార్యవర్గం సభ్యులు నమ్మకంగా గోల్‌మాల్ చేశారన్నారు. బాధితుల్లో ఇప్పటికే 14 మంది మృతి చెందారని తెలిపారు. ప్రభుత్వ ఉన్నత అధికారులు సత్వరమే స్పందించి విచారణను వేగవంతం చేసి బాధితుల సొమ్ము వెంటనే తిరిగి చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బాధితులు జే రమేష్ బాబు, కారంచేటి శివరామకృష్ణ, పెద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మారెడ్డి రమణారెడ్డి, రాఘవరెడ్డి, శ్రీనివాసరావు, మధుసూదనరావు పాల్గొన్నారు.

మెదడు వ్యాధులపై అప్రమత్తత అవసరం


సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న వైద్యులు

చినగంజాం: పక్షవాతం, మూర్ఛ, తలతిప్పడం తదితర లక్షణాలు మెదడుకు సంబంధించిన రోగాలని గుంటూరుకు చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ రాయని మురళి అన్నారు. గ్రామీణ వైద్యులకు మెదడు, నరాలు, పక్షవాతం మొదలయిన వ్యాధులకు సంబంధించి అవగాహన సదస్సు ఆదివారం ఇంకొల్లులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ జ్వరం, కాళ్ల తిమ్మిరి, విపరీతమైన వాంతులు వంటి లక్షణాలు కూడా మెదడుకు సంబంధించి ఉంటాయని, పక్షవాతం అని తెలిసిన వెంటనే గుర్తించి వైద్యం అందించగలిగితే పూర్తిగా నయం చేయవచ్చన్నారు. మూఢనమ్మకాలు నమ్మి ప్రాణాలు తీసుకోవద్దని, నాటు వైద్యం వద్దు అని ఆయన సూచించారు. స్త్రీల వైద్యురాలు డాక్టర్ సత్య మాట్లాడుతూ 45 ఏళ్లు నిండిన మహిళలు తప్పనసరిగా క్యాన్సర్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణ అనంతరం గ్రామీణ వైద్యులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల హెల్త్ ఫస్ట్ ఎయిడర్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ రావి నూతల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, బాషా తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని


అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూల విరాట్టు

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం మాఘ మాసం కృత్తిక నక్షత్రం నవమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

చెస్ పోటీలతో చిన్నారుల్లో ప్రతిభ


బహుమతులు అందుకున్న విజేతలతో క్లబ్ సభ్యులు

వేటపాలెం: చిన్న వయసులోనే చెస్ పోటీలు నిర్వహించడం ద్వారా చిన్నారుల్లో ప్రతిభా పాటవాలు వెలికి తీయవచ్చని దేశాయిపేట మాతృశ్రీ సంస్కృత పాఠశాల హెచ్ఎం సిద్ది నాగసోమేశ్వరశర్మ పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ రోడ్డులోగల రోటరీ కమ్యూనిటీ హాల్లో ఏపీ చెస్ అకాడెమీ ప్రోబస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో చిన్నారులకు ఆదివారం చెస్ పోటీలు నిర్వహించారు. చీరాల సిటీ బ్యాంక్ మేనేజర్ ప్రభు చిన్నారులకు చదరంగం లో నైపుణ్యతను మెరుగుపరచుకోవలను వివరించారు. కార్యక్రమంలో రొటేరియన్ గొల్లపూడి సీతారాం, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎస్ నాగేంద్రం, ప్రోబస్ క్లబ్ అధ్యక్షుడు వీ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల రక్షణ మనందరి బాధ్యత


సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై జనార్దన్

చీరాల: గ్రామాల రక్షణ మన బాధ్యతని చీరాల రూరల్ ఎస్సై జనార్దన్ అన్నారు. ఐక్య మానవ హక్కుల పరిరక్షకుల మండలి రాష్ట్ర కన్వీనర్ తాళ్లూరి ప్రదీప్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి మండలంలోని కావూరివారిపాలెంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధితో పాటు గ్రామంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా గ్రామస్తులదేనన్నారు. కార్యక్రమంలో మండలి బాపట్ల జిల్లా అధ్యక్షుడు అవ్వారు తారకరామారావు, ప్రధాన కార్యదర్శి అవ్వారు లక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ సుబ్బారావు, యూత్ ప్రెసిడెంట్ బాలసుబ్రహ్మణ్యం, పద్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు కారంచేడు మండల సమావేశం

కారంచేడు: ఈ నెల 31వ తేదీ మంగళవారం మధ్యాహ్నం కారంచేడు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన జరిగే సమావేశంలో వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆమె తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ సభ్యురాలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పూర్తి నివేదికలు, సమాచారంతో తప్పకుండా హాజరు కావాలని ఆమె కోరారు.

బెల్లం ఊట ధ్వంసం


డ్రమ్ములను పారబోస్తున్న పోలీసులు

చీరాల: బెల్లం ఊట తయారీ స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. చీరాల మండలం బోయినవారిపాలెం శివారు ప్రాంతంలో ఆదివారం రాత్రి ఈపూరుపాలెం పోలీసులు నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. సారా తయారీ కోసం భూమిలో డ్రమ్ముల్లోదాచి ఉంచిన నాలుగు వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా తయారీ స్థావరాలపై నిరంతరం దాడులు నిర్వహిస్తామని, నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జనార్దన్ తెలిపారు. దాడుల్లో ఈపూరుపాలెం పోలీసులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న రోటరీ సభ్యులు

పర్చూరు: మండలంలోని నాగులపాలెం చెరువుకట్టపై రోటరీ క్లబ్, ఆర్ఈఈ నాగులపాలెం సంయుక్తంగా వాకర్స్‌కు ఉపయోగపడే విధంగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. సుమారు కిలో మీటరు పొడవున ట్రాక్ పనులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రాఫిక్, పొల్యూషన్ లేని నడకదారి వాకర్స్‌కు ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, రోటరీ సభ్యులు తేళ్ల రమేష్ చంద్ర, కాసా అశోక్, కొల్లా సుబ్బారావు, పాదాలు వెంకన్న, ఆర్ఈఈ అధ్యక్షుడు రాఘవయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు కారంచేడులో స్పందన

కారంచేడు: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమాన్ని సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహిస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పీ సుశీలాదేవి తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు, విద్యార్థులు అర్జీలు పెట్టుకోవచ్చన్నారు. కార్యక్రమానికి మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పకుండా హాజరుకావాలని ఆమె కోరారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలుంటాయని ఆమె తెలిపారు.

మాజీ సైనికుడికి నివాళులు

చినగంజాం: స్థానిక అంబేడ్కర్ నగర్ శనివారం రాత్రి మృతి చెందిన మాజీ సైనికుడు అల్లడి సుబ్బారావు భౌతిక కాయానికి మండల మాజీ సైనికులు నివాళులర్పించారు. మండల మాజీ సైనికుల సంఘం సభ్యులు ఆదివారం సుబ్బారావు ఇంటికి వెళ్ల మిలటరీ పద్ధతిలో డ్రిల్ నిర్వహించి భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధి జీ పాండురంగా విఠల్ రెడ్డి మాట్లాడుతూ సుబ్బారావు 1956లో ఇండియన్ ఆర్మీలో చేరి 1965లో చైనాతో 1971లో పాకిస్తాన్‌తో యుద్ధం చేసి 1976లో ఎస్సీ రేంజ్ ర్యాంక్‌తో పదవీ విరమణ చేసారన్నారు. ఇండియన్ ఆర్మీలో ఆయన చేసిన సేవలకు గాను ఆయనకు ఘనమైన నివాళులర్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనికులు సీ లక్ష్మీనారాయణ, వాటుపల్లి బలరాం, కుక్కల ఏడుకొండలు రెడ్డి, యోహాను, నాగేంద్రరెడ్డి తదితర మాజీ సైనికులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేడు ప్రకృతి ఉత్పత్తుల మేళా

తాళ్లూరు: ప్రకృతి సాగుతో పండించిన పలు రకాలు ఉత్పత్తులను రైతులు అమ్ముకునేందుకు వీలుగా స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయ ఆవరణలో సోమవారం మేళా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం నుంచి మేళ ఉంటుందని చెప్పారు. కొర్రలు, ఊదలు, సామలు, అరికలు, ఆంధ్రు కొర్రలు, వేరుశనగ, బొప్పాయి, సబ్బులు, బెల్లంపొడి, తాటి కలకండ, మహాబీర విత్తనాలు, రాగిపూస, వరిగ పూస, నల్లనువ్వు ఉండలు, వినియోగదారులు మేళా సందర్శించి అవసరమైన ప్రకృతి ఉత్పత్తులు కొనుగోలు చేసి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఏవో ప్రసాదరావు కోరారు.